Andhra Jyothy Dt- 14/12/17



## హైటెక్ సిటీతోపాటే..

# ఎల్బీనగర్‌కూ మెట్రో పరుగులు!

**మెట్రో లైట్స్**

హైదరాబాద్ సిటీ, డిసెంబర్ 13 (ఆంధ్రజ్యోతి): అమీర్‌పేట నుంచి హైటెక్ సిటీ వరకే కాదు ఎల్బీ నగర్ వరకూ మెట్రో రైలు త్వరలోనే పరుగులు పెట్టనుంది. ఒకేసారి రెండు మార్గాల్లో మెట్రో రైలును ప్రారంభించేందుకు హైదరాబాద్ మెట్రో రైలు అధికారులు కార్యాచరణను సిద్ధం చేశారు. అమీర్‌పేట కేంద్రంగా రెండు కొత్త మార్గాలను మరో ఐదు నెలల్లోపే ప్రారంభించేలా ప్రణాళికలను రూపొందించారు. మొదటి దశలో ప్రారంభమైన మెట్రో రైళ్లు అమీర్‌పేట కేంద్రంగా మియాపూర్, నాగోల్ వరకు 30 కి.మీ మేర పరుగులు పెడుతున్నాయి. రెండో దశలో అమీర్‌పేట కేంద్రంగా అటు హైటెక్ సిటీ, ఇటు ఎల్బీనగర్ వరకు మొత్తం 24.5 కి.మీ దూరం నడిపేందుకు కసరత్తు చేస్తున్నారు. ప్రస్తుతం మియాపూర్ నుంచి అమీర్‌పేట, నాగోల్ నుంచి అమీర్‌పేట వరకు తిరుగుతున్నాయి. ఇవే రైళ్లు పొడిగింపుగా అమీర్‌పేట నుంచి హైటెక్ సిటీ వరకు, అమీర్‌పేట నుంచి ఎల్బీనగర్ వరకు నడిపేలా మెట్రో కారిడార్ల నిర్మాణ పనులు చివరి దశలో ఉన్నాయి. ఈ రెండు మార్గాల్లో కీలకమైన పనులను త్వరితగతిన ఎలా పూర్తి చేయాలన్న అంశంపై నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీ మెట్రోలో ఉన్నతాధికారులతో మెట్రో రైలు అధికారులు పలుమార్లు చర్చించారు. రెండో దశను వీలైనంత త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తున్నారు. ప్రభుత్వం సైతం వేగంగా మిగతా మార్గాలను దశల వారీగా వెనువెంటనే అందుబాటులోకి తేవాలని ఆదేశించింది. ఇప్పటికే మెట్రో ఎం.డి ఎన్వీఎస్ రెడ్డి అమీర్‌పేట నుంచి హైటెక్ సిటీ వరకు ఉన్న 8.5 కి.మీ మార్గాన్ని ఎల్ అండ్ టీ మెట్రో ఇంజనీర్లతో కలిసి క్షేత్ర స్థాయిలో పర్యటించి, పనులను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. అదే విధంగా ఎల్బీనగర్ మార్గం కూడా నిత్యం ట్రాఫిక్‌తో కూడుకున్నదే కావడంతో అదే సమయానికి దీన్ని కూడా పూర్తి చేయాలని మంత్రి కేటీఆర్ మెట్రో అధికారులను ఆదేశించారు. రెండు మార్గాల్లోనూ ఏకకాలంలో శరవేగంగా పనులు పూర్తి చేసే పనిలో మెట్రో అధికారులు నిమగ్నమై ఉన్నారు.

### కీలకంగా స్టేషన్ల నిర్మాణాలు

అమీర్‌పేట నుంచి ఎల్బీనగర్, అమీర్‌పేట నుంచి హైటెక్ సిటీ మార్గాల్లో మెట్రో స్టేషన్ల వద్ద నిర్మాణం పనుల్లో తీవ్ర జాప్యం చోటు చేసుకుంది. ప్రతి మెట్రో స్టేషన్ వద్ద రోడ్డు భాగంలో స్థల సేకరణ సమస్య ఉండడం, నిర్మాణాలు చేపట్టేందుకు వీలుగా రైట్ ఆఫ్ వే లేకపోవడంతో మెట్రో స్టేషన్‌ల నత్తనడకన నిర్మాణాలు సాగుతున్నాయి. ప్రభుత్వం చొరవతో ఈ పనులన్నీ మళ్లీ వేగంగా పూర్తి చేసే అవకాశముంది. ఇప్పటికే ఈ విషయాన్ని మెట్రో అధికారులు మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకువెళ్లడంతో జీహెచ్‌ఎంసీతోపాటు ఇతర శాఖల అధికారులు సహకరించి, పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎంజీబీఎస్ ఇంటర్ చేంజ్ స్టేషన్‌లో అమీర్‌పేట నుంచి ఎల్బీనగర్ మార్గంలో పనులను త్వరగా పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నారు.

### అమీర్‌పేట-ఎల్బీనగర్ మార్గంలో 16 మెట్రో స్టేషన్లు

రద్దీగా ఉండే ఎల్బీనగర్-మియాపూర్ మెట్రో కారిడార్‌లో మొత్తం 27 మెట్రో స్టేషన్లు ఉండగా, ఇప్పటికే 11 మెట్రోస్టేషన్ల మీదుగా మెట్రో రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయి. ఇక మిగిలిన 16 మెట్రో స్టేషన్‌లైన పంజాగుట్ట, ఎర్రమంజిల్, ఖైరతాబాద్, లక్డీకాపూల్, పబ్లిక్ గార్డెన్, నాంపల్లి, గాంధీభవన్, కోఠి, ఎంజీబీఎస్ ఇంటర్ చేంజ్, మలక్‌పేట (చాదర్‌ఘాట్), న్యూ మలక్‌పేట, మూసారాంబాగ్, దిల్‌సుఖ్‌నగర్, చైతన్యపురి, విక్టోరియా మెమోరియల్, ఎల్బీనగర్ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిలో మలక్‌పేట వరకు స్టేషన్ల నిర్మాణం దాదాపు పూర్తవగా, ఎంజీబీఎస్ నుంచి పంజాగుట్ట వరకు ఉన్న స్టేషన్లలో పనులు పురోగతిలో ఉన్నాయి.



అమీర్‌పేట మెట్రో రైల్వే స్టేషన్

### ప్రతిష్ఠాత్మకంగా హైటెక్ సిటీ మార్గం..

అమీర్‌పేట నుంచి హైటెక్ సిటీ వరకు ఉన్న మార్గాన్ని ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్నారు. నాగోల్ నుంచి హైటెక్ సిటీ వరకు ఉండే మార్గం ప్రయాణికులకు అందుబాటులోకి వస్తే లక్షలాది మంది ఐటీ ఉద్యోగులు మెట్రోను ఆశ్రయించే అవకాశముంది. ఈ క్రమంలోనే మంత్రి కేటీఆర్ ఈ మార్గాన్ని జూన్ 1 లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. దీంతో అధికారులు ఇక్కడ క్షేత్ర స్థాయిలో పనుల వేగాన్ని పెంచారు. అమీర్‌పేట నుంచి హైటెక్ సిటీ వరకు మొత్తం 8 మెట్రో స్టేషన్‌లు ఉండగా, ఈ మెట్రో స్టేషన్లలో నిర్మాణ పనులు ప్రస్తుతానికి కొనసాగుతున్నాయి.

### లక్డీకాపూల్ వద్ద రైల్ ఓవర్ బ్రిడ్జి..

మెట్రో రైలు ప్రాజెక్టులో మొత్తం 8 చోట్ల రైల్ ఓవర్ బ్రిడ్జిలు నిర్మించాల్సి ఉండగా, ఇప్పటికే 6 చోట్ల నిర్మాణం పూర్తయింది. ఇక కేవలం లక్డీకాపూల్, సికింద్రాబాద్ పడమర వైపు కారిడార్-2లో బోయిగూడ వద్ద మరో రైల్ ఓవర్ బ్రిడ్జిని నిర్మించాల్సి ఉంది. రెండో దశలో ప్రారంభంలో లక్డీకాపూల్ ఆర్వోబీ కీలకం. దీని పనులు చురుగ్గా సాగుతున్నాయి. మరో నెలలోపే బ్రిడ్జిని పూర్తి చేస్తామని మెట్రో అధికారులు తెలిపారు.

### రెండో దశలో మాల్స్‌తో అనుసంధానం..

మెట్రో ప్రాజెక్టులో మాల్స్ అత్యంత కీలకం. అవే నిర్మాణ సంస్థకు ప్రధాన ఆదాయ వనరు. ఇప్పటికే నాలుగు చోట్ల పంజాగుట్ట, ఎర్రమంజిల్, హైటెక్ సిటీ, మూసారంబాగ్‌లో మెట్రో మాల్స్ నిర్మాణం చేపట్టారు. వీటిలో పంజాగుట్ట, హైటెక్ సిటీ ప్రాంతాల్లో ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. అయితే మొదటి దశలో ప్రారంభించిన మెట్రో కారిడార్లకు వీటితో అనుసంధానం కలగలేదు. రెండో దశలో ప్రారంభించే అమీర్‌పేట-హైటెక్ సిటీ, అమీర్‌పేట-ఎల్బీనగర్ మార్గాల్లో ప్రారంభించే మెట్రోతో నాలుగు మెట్రో మాల్స్ అనుసంధానం కానున్నాయి. పంజాగుట్ట, హైటెక్ సిటీ ప్రాంతాల్లో మెట్రో మాల్స్ ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ రావడం లేదు.